





ఘనంగా వీరు బాల్ దివస్

ప్రజాశక్తి-కందుకూరు: టి ఆర్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం కళాశాల ప్రిన్సిపల్ షేక్ నాగూర్ వలి నేతృత్వంలో వీర్ బాల్ దివస్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాలురు ప్రత్యేకంగా బాలికలు వికసిత భారత్ లో భాగస్వామ్యం కావాలన్నారు. ప్రతి విద్యార్థి అకుంఠిత దీక్ష దక్షతలతో విద్యారంగంలో అప్రతిహతంగా రాణించాలని సూచించారు. స్వామి వివేకానంద నుడివినట్లు ఈ దేశానికి నిజమైన సంపద బాలబాలికలని వారు దృఢమైన అభివృద్ధి కాంక్షతో, ధైర్య సాహసాలతో జీవితంలో ఉన్నతిని సాధించాలని తెలిపారు . వీర్ బాల్ దివస్ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం పోటీలను నిర్వహించారు. డిజిటల్ ఇండియా పై పలు అంశాలను విశద పరిచారు.బేటీ బచావో..బేటీ పడావో. బాలికల సాధికారత, స్వచ్ఛభారత్ ఆవశ్యకత, డిజిటల్ ఇండియా గొప్పతనాన్ని ఆయన వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్. యూనిట్ ప్రోగ్రాం అధికారిణి దాసరి శిరీష ,విద్యార్థిని, విద్యార్థులు, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



మూడు మండలాల కోసం

ప్రజా నిరసన గళం..!

నెల్లూరు జిల్లాలోని రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలకు ఉంచాలని డిమాండ్ చేస్తూ ఆ మూడు ప్రాంతాల ప్రజలకు నిరసన గళం వినిపించారు. మంత్రివర్గ ఉప సంఘానికి అభ్యంతరాలు తెలపడానికి శుక్రవారం చివరి రోజు కావడంతో కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి సత్యప్రసాద్, జిల్లా పార్టీ అధ్యక్షులు బీద రవిచంద్రకు విజ్ఞప్తి చేశారు. తిరుపతి జిల్లాలో ఉన్న గూడూరును సిఎం చంద్రబాబు నాయుడుకు మరోసారి గూడూరు ఎంఎల్ఎ పాశం సునీల్‌కుమార్ గూడూరును నెల్లూరులో కలపాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 29న ప్రభుత్వం నిర్ణయం ప్రకటించనుంది.

..ముగిసిన అభ్యంతరాల స్వీకరణ
..29న ప్రభుత్వం నిర్ణయం
..గూడూరు విషయమే సందిగ్ధత



కలెక్టర్‌కు అర్జీ ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

ప్రజల అభిప్రాయాలను పట్టించు కోకుండా.. .అధికారపార్టీ నేతల విజ్ఞప్తిని లెక్కలో తీసుకోకుండా... .మంత్రి వర్గ ఉప సంఘం నిర్ణయం తీసుకుంది. జిల్లాలో కొనసాగుతోన్న రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలను గూడూరు డివిజన్‌లో కలిపి తిరుపతి జిల్లాలో చేర్చడానికి సిఫార్సు చేశారు.ఈ విషయంలో మూడు మండలాల ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమం నిర్వహిస్తున్నారు. తమను నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని నెల రోజుల నుంచి దశలవారీ ఉద్యమం నిర్వహిస్తున్నారు.టిడిపి, వైసిపి, బిజెపి, కాంగ్రెస్‌తోపాటు ఇతర పక్షాలు ఆందోళన చేస్తున్నాయి. రాపూరు మండలంలోని కండలేరు జలాశయం విషయంలో నీటి ఇబ్బందులు వచ్చే అవకాశం ఉండడంతో సర్వేపల్లి ఎంఎల్ఎ సోమిరెడ్డిచంద్రమోహన్‌రెడ్డి మంత్రివర్గ ఉప సంఘానికి లేఖ రాశారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మూడు మండలాల విషయమై సిఎం చంద్రబాబునాయుడు, ఉప సంఘం ఛైర్మన్ అలగాని సత్యప్రసాద్, జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్రకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం ఒక అంగీకారానికి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. ఇదే విషయమై జిల్లాలోని మంత్రులు, ఎంఎల్ఎలు, ముఖ్యనాయకులు కలిసి సిఎం వద్దకు వెళుతామని బీద రవిచంద్ర ప్రకటించారు.

గూడూరును నెల్లూరులో చేర్చండి:పాశం సునీల్‌కుమార్

గూడూరు ప్రజలకు మీరు ఇచ్చిన హామీ ప్రకారం నెల్లూరు జిల్లాలో కలపాలని గూడూరు ఎంఎల్ఎ పాశం సునీల్‌కుమార్ కోరారు. గతంలో చంద్రబాబునాయుడు, నారా లోకేష్ ఇద్దరు నేతలు గూడూరు వేదికగా గూడూరును నెల్లూరులో కలుపుతామని హామీ ఇచ్చారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక మాట మార్చుతున్నారు. ఇదే విషయమై తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని సునీల్‌కుమార్ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును విజయవాడలో కలిసి ఇదే విషయమై మాట్లాడినట్లు తెలిసింది. గూడూరు ప్రజల కోరికగా చెప్పినట్లు తెలిసింది. మరో వైపు దాదాపు నెలరోజుల నుంచి గూడూరులో అన్ని రాజకీయ పక్షాలు పెద్ద ఆందోళనలు నిర్వహిస్తున్నారు. దీక్షలు చేస్తున్నారు. శుక్రవారం తిరుపతికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి సునీల్‌కుమార్ మరోసారి గూడూరు విషయమై మాట్లాడినట్లు తెలిసింది. ఈనెల 29న ప్రభుత్వం తన నిర్ణయం ప్రకటించనుంది. ఎం జరుగుతుందోననే ఆందోళన జిల్లా ప్రజల్లో ఉంది.



పోలీస్ స్టేషన్‌లో తనిఖీ

ప్రజాశక్తి-గుడ్లూరు

గుడ్లూరు పోలీస్ స్టేషన్ తోటి సర్కిల్ కార్యాలయంలో కందుకూరు డిఎస్‌పి బాలసుబ్రమణ్యం వార్షిక తనిఖీలు శుక్రవారం నిర్వహించారు పెండింగ్ కేసులు త్వరితగతిన పూర్తి చేయాలని శాంతి భద్రతలు పరిరక్షించే విషయంలో రాజకీయాలకు తావు లేకుండా చూడాలని డి సిఐ, ఎస్ఐలను కోరారు. నూతన సంవత్సరం సంక్రాంతి తదితర పర్వదినాల సందర్భంగా కోడి పందేలు, పేకాటకు సంబంధించిన క్రీడలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, రౌడీ షీటర్ల విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించాలన్నారు. 2025 సంవత్సరానికి సంబంధించి రికార్డులు తనిఖీలు నిర్వహించారు. సిఐ మంగారావు, ఎస్ఐ వెంకట్రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎపిజిఇఎ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నెల్లూరు :ఏపీజీఈఏ నెల్లూరు జిల్లా శాఖ, నెల్లూరు రూరల్ యూనిట్, సచివాలయ సంఘం 2026 నూతన సంవత్సర టేబుల్ క్యాలెండర్ లను గౌరవ ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రివర్యులు ఆనం రాంనారాయణ రెడ్డి ఆవిష్కరించారు. శుక్రవారం మంత్రి స్వగృహం / క్యాంపు కార్యాల యంలో అత్యంత ఘనంగా జరిగిన ఈ సంయుక్త క్యాలెండర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో ఏపీజీఈఏ రాష్ట్ర కార్యదర్శి ఎస్ చక్రవర్తి, జిల్లా అధ్యక్షులు బి సుధాకర రెడ్డి, జిల్లా కార్యదర్శి రాంప్రసాద్, పెన్షనర్ల సంఘం అధ్యక్షులు వై. రమణారెడ్డి, జిల్లా మహిళా విభాగం ఛైర్మన్ సుజాతాబాయి, నెల్లూరు సిటీ అధ్యక్షులు కిరణ్ కుమార్, రూరల్ అధ్యక్షులు ఆర్ శ్రీనివాసులు సచివాలయ సంఘం అధ్యక్షులు మణి, పలువురు ఉద్యోగులు హాజరయ్యారు.

సిఐటియు ఆధ్వర్యంలో సాంస్కృతిక ఉత్సవాలు



కోలాటం ఆడుతున్న మహిళలు

ప్రజాశక్తి-నెల్లూరు

ఆంధ్ర రాష్ట్రంలోని విశాఖపట్టణంలో డిసెంబరు 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు సిఐటియు అఖిల భారత 18వ మహాసభలు జరుగుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని నెల్లూరు నగరంలోని ముత్తుకూరు బస్టాండ్ సెంటర్ సమీపంలో సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో కళారూపాలతో సాంస్కృతిక ఉత్సవాలు'నెల్లూరు శ్రామిక ఉత్సవ్-2025' పేరుతో శ్రామికుల ఉత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు కోలాట ప్రదర్శన, పప్పుల వీధి హమాలీ కార్మికులు పండరీ భజన, క్లాసికల్ నృత్య ప్రదర్శన, నెల్లూరు అసోసియేషన్ ఈవెంట్ నృత్యరూపకం, సింహపురి స్పోర్ట్స్ అకాడమి వారిచే కర్రసాము, వివిధ పాటలకు నృత్యరూపకాలు ప్రదర్శించారు.

కార్మిక ఉత్సవ్..ఉత్తేజం..

ఆలోచింప చేసిన ప్రదర్శనలు

సిఐటియు ఆల్ ఇండియా మహాసభల సన్నాహక వేడుకలుసిఐటి యు ఆల్ ఇండియా మహాసభల సం దర్భంగా శుక్రవారం రాత్రి నెల్లూరు నగరంలోని హరనాథపురం సెంటర్‌లో నిర్వహించిన శ్రామిక ఉత్సవ్ కార్యక్రమం ప్రజలను, కార్మికులను ఉత్తేజ పరచింది. ఈ నెల 30నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నం నగరంలో సిఐటియు ఆల్ ఇండియా మహాసభలు జరుగుతున్నాయి. అందులో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలో శ్రామిక ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రజానాట్యమండలి కళాకారులు, ఆలపించిన విప్లవగీతాలు ప్రేక్షకులను అలరించాయి. ఎర్రచీరలు ధరించిన మహిళల కోలాట నృత్యం ఆద్యంతం ఉర్రూతలించింది. లయబద్ధంగా సాగిన కోలాటానికి ప్రేక్షకులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో జరిగిన కార్మిక పోరాటాలు సాధించిన విజయాలపై సిఐటియు నాయకులు వివరించారు. సిఐటియు కార్మికులు నృత్యం ప్రేక్షకులను ఉర్రూతలూరించింది. కర్రసాము కార్మిక చైతన్యాన్ని మేల్కొలిపింది. ప్రేక్షకులు ఈ కార్యక్రమాన్ని చూసి మంత్రముగ్ధులయ్యారు. సిఐటియు జిందాబాద్, కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటు నినదించారు. జయప్రదం చేయండి ఆల్ ఇండియా మహాసభలంటూ కార్యకర్తలు, నాయకులు నినదించారు. ఈ ఉత్సవ్‌లో ఆటో కార్మికులు, సిఐటియు అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సభా ప్రాంగణమంతా ప్రజలతో కిక్కిరిసిపోయింది. ఈ ప్రారంభసభలో ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కత్తిశ్రీనివాసులు, జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ అనేక పోరాటాలు చేసి విజయం సాధించి కార్మికులకు అండగా నిలిచినటువంటి సంఘం సిఐటియు అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి వర్గ సభ్యులు మూలం ప్రసాద్, స్వర్ణ బాబురావు, అశోక్, ఏ కామాక్షి, జి.కామాక్షమ్మ, దామదర్‌రెడ్డి, ఆర్.శ్రీనివాసులు, పి.సూర్య నారాయణ, జి.రాంబాబుశేషయ్య పాల్గొన్నారు. ,

సిఐటియు అఖిల భారత మహా సభలకు తరలిరండి

ప్రజాశక్తి-కందుకూరు:సిఐటియు అఖిల భారత 18వ మహాసభలు ఈనెల 31నుంచి 2026 జనవరి 4వరకు విశాఖపట్నంలో జరుగుతున్న సందర్భంగా మహాసభలు ముగింపు 4న విశాఖలో జరిగే కార్మిక ర్యాలీ,బహిరంగ సభకుఉద్యోగులు, కార్మికులు, ఎన్షనర్లు,ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని సిఐటియు ప్రకాశం జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు పిలుపునిచ్చారు. విశాఖలో జరిగే అఖిల భారత సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలని ఉమ్మడి ప్రకాశం జిల్లాలో జరుగుతున్న జీపు జాతా శుక్రవారం సింగరాయకొండ నుండి పొన్నలూరు వెళ్తూ కందుకూరు ఆర్టీసీ డిపో వద్ద కార్మికునుద్దేశించి మాట్లాడారు.సిఐటియు ప్రకాశం జిల్లా నాయకులకి సిఐటియు నెల్లూరు జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు,జిల్లా నాయకులు జివిబీ కుమార్,ఎస్ఎ గౌస్,రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకులు ముప్పరాజు కోటయ్య,సిఐటియు కందుకూరు పట్టణ అధ్యక్షుడు జి రమేష్,వలేటివారిపాలెం మండల కోకన్వనర్ ఎస్‌డి గౌస్ బాషా,కరేడు ఉద్యమ నాయకులు సాయి మల్లికార్జున తదితరులు ఘన స్వాగతం పలికారు.జాతా నుద్దేశించి కాలం సుబ్బారావు మాట్లాడారు. జాతాలో ఉమ్మడి ప్రకాశం జిల్లా సిఐటియు కార్యదర్శి జి శ్రీనువాసులు, జిల్లా ఆఫీసు బేరర్లు టి రాము, బంకా సుబ్బారావు, ఎస్‌డి బాషా పాల్గొన్నారు.



జిల్లాలో ఆకస్మిక తనిఖీలు చేపట్టండి

ప్రజాశక్తి -నెల్లూరు :వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా జిల్లావ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు చేయాలని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో జిల్లా వినియోగదారుల పరిరక్షణ మండలి సమావేశం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. కమిటీ లక్ష్యాలు, చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికను జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి బి.లీలారాణి సభ్యులకు వివరించారు. శాఖల వారీగా వినియోగదారుల పరిరక్షణకు చేపడుతున్న చర్యలను జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లా వినియోగదారుల పరిరక్షణ మండలిలోని అధికారులందరూ ఒక ప్రత్యేక బృందంగా ఏర్పడి జిల్లావ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని సూచించారు. తూకాల్లో మోసాలు, పెట్రోలు బంకులు, గ్యాస్ ఏజెన్సీలు, షాపింగ్‌మాల్స్, సినిమాహాళ్లు, మెడికల్ షాపులు, చౌక ధరల దుకాణాలు, వ్యాపార సముదాయాల్లో వినియోగదారులకు అందుతున్న సేవలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సేవల్లో లోపం ఉన్నా, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించినా వెంటనే కేసులు నమోదు చేయాలన్నారు. వినియోగదారుల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు విచారించి వెంటనే పరిష్కరించాలన్నారు. సమావేశంలో డిఎస్‌వో లీలారాణి, డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ సుజాత, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ కనకాద్రి, ఎఎస్‌ఒలు లక్ష్మీనారాయణరెడ్డి, పుల్లయ్య, ఆర్‌టిసి మేనేజర్ రమేష్‌బాబు, ఫుడ్‌సేఫ్టీ, తూనికల కొలతలు, ట్రాన్స్‌పోర్టు అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అవినీతి బయటపడుతుందనే “కాకాణి”ఎదురుదాడి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి :వైసిపి ప్రభుత్వంలో ఇరిగేషన్‌లో జరిగిన అవినీతి ఎక్కడ బయటపడుతుందనే మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎదురుదాడి చేస్తున్నారని పొదలకూరు టిడిపి మండల అధ్యక్షులు, పిఎసిఎస్ ఛైర్మన్ తలచీరు మస్తాన్‌బాబు విమర్శించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ హయాంలో పనులు చేయకుండానే కోట్లాది రూపాయల దోపిడీ చేశారన్నారు. కూటమి పాలనలో అత్యంత పారదర్శకంగా ఇరిగేషన్ పనులు చేశామన్నారు. అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న సోమిరెడ్డిపై కాకాణి గోవర్ధన్ రెడ్డి అవాకులు చెవాకులు పేలడమే పనిగా పెట్టుకున్నారన్నారు. వైసీపీ హయాంలో ఇరిగేషన్ పనుల్లో భారీగా అక్రమాలు జరిగాయని మేం ఎప్పటి నుంచో చెబుతూ వస్తున్నామని, పనులు చేయకుండానే చేసినట్టు చూపి బిల్లులు చేసుకున్న ఘటనలపై విచారణ జరపాలని మా నాయకుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి కోరుతూ వచ్చారన్నారు. విచారణలో తన అవినీతి లీలలు బయటపడుతాయనే కంగారుతోనే కాకాణి ఎదురుదాడికి దిగుతున్నారన్నారు. ఇటీవల వచ్చిన రెండు తుపాన్ల కారణంగా దెబ్బతిన్న కాలువల మరమ్మతులకు జిల్లాలో రూ.97 కోట్లు, సర్వేపల్లికి రూ.17 కోట్ల ఎఫ్.డీ.ఆర్ నిధులను కలెక్టర్ మంజూరు చేశారన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో 316 పనులను గుర్తించారని,ఇప్పటి వరకు పనులకు అనుమతులు మాత్రమే వచ్చాయి..ఇంకా పనులు ప్రారంభం కాలేదన్నారు. ప్యాకేజీల రూపంలో కోట్లు కాజేయడమే పనిగా పెట్టుకున్న కాకాణి ఇంకా ఆ ట్రాన్స్ నుంచి బయటకు రాలేకపోతున్నారన్నారు.





నినాదాలు చేస్తున్న నాయకులు, బాధితులు

రిజిస్ట్రేషన్ పట్టాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు

స్థానిక ఎన్‌టిఆర్ నగర్, రాయపు పాలెం,పల్లిపాలెంలో రిజిస్ట్రేషన్ పట్టాలు మంజూరు చేయాలని, ఎన్‌టిఆర్ నగర్ లో రేషన్ షాపు ఏర్పాటు చేయాలని సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం నగర నియోజకవర్గ పరిధిలోని 11వ డివిజన్ సచివాలయం వద్ద ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజలతో కలిసి వెళ్లి సిపిఎం ఆధ్వర్యంలో నాయకులు నిరసన ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు, స్థానిక ఎన్‌టిఆర్ నగర్, రాయపు పాలెం,పల్లిపాలెం ప్రజలు తమ నివాసాలకు రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ చేయాలని, ఎన్‌టిఆర్ నగర్ ప్రాంత ప్రజలకు రేషన్ సరుకులు పంపిణీ చేసేందుకు రేషన్ షాపును ఏర్పాటు చేయాలంటూ నినాదాలు చేశారు. అనంతరం ప్రజాదర్బార్ లో ఉన్నటువంటి అధికారులకు అర్జీలు సమర్పించారు.ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు పి.సూర్యనారాయణ, నగర కమిటీ సభ్యులు ఆవుల పెంచలయ్యలు మాట్లాడుతూ నెల్లూరు నగరంలోని 70 శాతానికి పైగా పేద, మధ్యతరగతి ప్రజలు నివసించే ప్రాంతాలలో పొజిషన్ సర్టిఫికెట్లు బీఫారం పట్టాలు ఉండటం, రిజిస్ట్రేషన్ సౌకర్యం వాటికి లేకపోవడం వల్ల ఆస్తి ఉన్న ప్రజల అక్కరకు ఆస్తి ఉపయోగపడకుండా ఉండే పరిస్థితి ఏర్పడిందన్నారు. రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వం నుండి రిజిస్ట్రేషన్ పట్టాలు మంజూరు చేయడం వల్ల ప్రజలకు పెద్ద ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. మంత్రి నారాయణ తక్షణమే రిజిస్ట్రేషన్ పట్టాలు మంజూరు చేయాలని కోరారు. 11వ డివిజన్ ఎన్‌టిఆర్ నగర్ రాయపుపాలెం పల్లెపాలెం తదితర ప్రాంతాలలో ఈ పరిస్థితి తీవ్రంగా ఉందని తెలిపారు. ఈ ప్రాంతాలన్నీ కూడా ప్రభుత్వం లేఅవుట్లు వేసి నిరుపేద మధ్యతరగతి ప్రజలకు ఇచ్చినవేనని తెలిపారు. ఎన్‌టిఆర్ నగర్ లో రేషన్ షాపు లేకపోవడం వల్ల ప్రజలు సరుకులు తెచ్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలియజేశారు. ధర్నా అనంతరం ప్రజలతో కలిసి ప్రజాదర్బార్‌లోనున్న నగరపాలక సంస్థ అధికారులకు అర్జీని సమర్పించారు. కార్యక్రమంలో ఎన్‌టిఆర్ నగర్ శాఖ కార్యదర్శి జి మురళి, సిపిఎం నగర కమిటీ సభ్యులు బీపీ నరసింహ, ఐద్వా జిల్లా అధ్యక్షులు శివ కుమారి, స్థానిక నాయకులు పసుపులేటిమల్లికార్జున, టి.నారాయణ, బి.వెంకటేశ్వర్లురెడ్డి, కర్తం.బాబు, కత్తి.చిన్న, పి.సురేష్, నాగ రాజు, ఎం.వెంకటేశ్వర్లు, పి.శ్రీనివాసులు, పి.సుందర ప్రవీణ్, రవీంద్ర, రమేష్ పాల్గొన్నారు.



నెల్లూరు రూరల్‌లో నినాదాలు చేస్తున్న నాయకులు

ఇళ్లకు పట్టాలు మంజూరు చేయాలని ధర్నా

ప్రజాశక్తి-నెల్లూరు+రూరల్ నియోజకవర్గ పరిధిలోని 31 డివిజన్ టైలర్స్ కాలనీలో ఇంటి పట్టాలు మంజూరు చేయాలంటూ ,రోడ్లు, డ్రెయినేజీ కాలువలు ,వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ,స్కూల్ మరమ్మతులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ సిపిఎం 31వ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో వార్డు సచివాలయం దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ టైలర్స్ కాలనీ ఏర్పడి దాదాపు 35 సంవత్సరాలు కావస్తున్న ,ఇంతవరకు ఇంటి పట్టాలు మంజూరు చేయలేదన్నారు. ఈ ప్రాంతంలోని ప్రజలు తమ ఇళ్లకు ఇప్పటికే నగరపాలక సంస్థకి పన్నులు, కుళాయిలకు పన్నులు చెల్లిస్తున్నారన్నారు. పన్నుల వసూళ్లు చేయడంలో చూపిస్తున్న ఆసక్తి ఆ ప్రాంత ఇళ్లకు పట్టాలు మంజూరు చేయాలని అనేక దఫాలు ఆందోళన చేస్తున్న మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. అదేవిధంగా రోడ్లు, డ్రెయినేజీ కాలువలు కూడా దారుణంగా ఉన్నాయన్నారు. .వీటిని వెంటనే రిపేరు చేయాలని డిమాండ్ చేశారు. టైలర్స్ కాలనీలోని గవర్నమెంట్ స్కూల్‌కి గ్రావెలింగ్ ఏర్పాటు చేసి చదువును చేయకపోవడం వలన వర్షాలు వచ్చినప్పుడు వర్షపునీరుతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాబట్టి గ్రావెలింగ్ ఏర్పాటు చేసి చదును చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వార్డు సచివాలయం అడ్మిన్‌కు వినతి పత్రం అందజేశారు.కార్యక్రమంలో సిపిఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, 31వ డివిజన్ శాఖ కార్యదర్శి నాగేశ్వర్ రెడ్డి, పి.నరసింహారెడ్డి. సుధాకర్. ఎస్కే ఖలీల్, ఎస్డి జబ్బర్, రమణారెడ్డి, ఓ గంగాధర్, ఎస్కే రహీం, సుబ్రహ్మణ్యం, డివైఎఫ్ఐ నాయకులు పెంచలయ్య, నాగ శేషు, పాల్గొన్నారు.




ఆదిలోనే సాగు నీటి కొరత..!

-ఆందోళనలో అన్నదాత

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

అసలే పండించిన ధాన్యానికి సరైన గిట్టుబాటు ధరలు లభించక పోవ డంతో అన్నదాతలు నష్టాలను చవి చూస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రారంభంలోనే ప్రభుత్వం వ్యవసాయానికి సాగు నీటి సరఫరాను సక్రమంగా అందించలేక పోతుండడంతో రైతులు తీవ్ర ఆం దోళన చెందుతున్నారు. రైతుల ఆవేదన మేరకు....రబీ సీజన్ను పురస్కరించుకొని మండలంలో సుమారు 20-25 వేల ఎకరాల్లో వరిసాగు చేడుతున్నారు. ఈ మేరకు జాఫర్ సాహెబ్ కాలువ నుంచి పే దూరు, కోవెరపాలెం, పాపిరెడ్డిపాలెం, ఇస్కపాలెం, తోటపల్లి, మాచర్లవారిపాలెం తదితర గ్రామ పంచాయతీల పరిధిలో రైతులు సుమారు 5 వేల ఎకరాల్లో వరి సాగు కు సిద్ధ పడ్డారు. ఈ మేరకు వరినాట్లు పూర్తయ్యాయి. సాగునీరు సక్రమంగా అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ విచిత్రం ఏమిటంటే ప్రధాన కాలువ నుంచి సాగునీరు పుష్కలంగా విడుదల అవుతున్నప్పటికి జాఫర్ సాహెబ్ కాలువ కింది కాలువలకు నీటి విడుదల సక్రమంగా జరగకపో వడం విచిత్రం. దాంతో రైతులు అయోమయం చెందుతున్నారు. ఓ వైపు కదుటే నార్లు దెబ్బతింటుడండంతో రైతులకు దిక్కు తోచడం లేదు. ఇప్పటికే 60,70 శాతం వరినాట్లు పూర్తి 15 శాతం వివిధ స్థాయిల్లో ఉన్నాయి. ఆరంభంలోనే సాగునీటి ఇబ్బందులు ఎదురైతే ముున్ముందు ఇంకెన్ని ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో సంబంధిత శాఖ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని సాగునీరు సరఫరా సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు..



ప్రతిభను చాటనున్న విద్యార్థులు

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు పట్టణానికి చెందిన శ్రీ నటరాజ నాట్యమండలి సరస్వతి నిలయం, వెంకటరమణ హోటల్ పైన, కనిగిరి రోడ్‌లో ఉన్న సంస్థకు చెందిన విద్యార్థులు ప్రతిష్ఠాత్మకమైన గిన్నిస్ వరల్డ్ రికార్డ్ కార్యక్రమంలో అధికారికంగా పాల్గొనబోతున్నారని నాట్య గురువు టివి దత్తేశ్వరి తెలిపారు.ఈ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ కార్యక్రమం ఈనెల 27 తేదీన హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భరతనాట్యం, కూచిపూడి నత్య శైలుల్లో మా సంస్థకు చెందిన మొత్తం 20 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు.

ఈ కార్యక్రమానికి నాట్య గురువు: కుమారి టి.వి. దత్తేశ్వరి నేతత్వంలో విద్యార్థులు శిక్షణ పొందారు. సాంప్రదాయ నత్య కళల పరిరక్షణ, ప్రచారం లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్న శ్రీ నటరాజ నాట్యమండలి సరస్వతి నిలయం ఈ ఘనతను సాధించడం కందుకూరు ప్రాంతానికి గర్వకారణంగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

మూడు మండలాలు నెల్లూరులో ఉంచండి

సిఎంకు మంత్రి ఆనం విజ్ఞప్తి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలను నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు రెవెన్యూశాఖ మంత్రికి, కలెక్టర్‌లకు తన తరపున విజ్ఞప్తి నివేదికలను అందజేశానని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. విభజన నోటిఫికేషన్‌కు సంబంధించి అభ్యంతరాలు తెలియజేయడానికి నేటితో ఆఖరి రోజు కావడంతో ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని ఈ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. శుక్రవారం నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో కలిసి మంత్రి ఆనం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ రాపూరు, కలువాయి, సైదాపురం మండలాల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బీద రవిచంద్రకు తమ వినతి పత్రాలు, అభ్యంతరాలను అందజేశారని మంత్రి వివరించారు. తాను రాపూరు, వెంకటగిరి నియోజకవర్గాలకు ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవంతో పాటు, ఆ ప్రాంతాల ప్రతినిధిగా, మంత్రిగా నెల్లూరు జిల్లా భవిష్యత్తు దృష్ట్యా ఈ మూడు మండలాలను నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని, ఆత్మకూరు రెవెన్యూ డివిజన్‌లో కలపాలని ముఖ్యమంత్రికి



విన్నవించా నన్నారు. ఈ విషయమై జిల్లా పార్టీ అధ్యక్షులు బీద రవిచంద్రకు కూడా తన విజ్ఞాపన పత్రాన్ని అందజేశానని తెలిపారు. నూతనంగా తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుఎ, లుగా బాధ్యతలు చేపట్టిన బీద రవి చంద్ర, ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, నెల్లూరు ఇన్‌ఛార్జి మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన రూప్‌కుమార్ యాదవ్‌లను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నెల్లూరు జిల్లా పార్లమెంటు టీడీపీ కమిటీకి ఎంపికైన ఆత్మకూరు నేతలను, రాష్ట్రస్థాయిలో డైరెక్టర్ పదవులు పొందిన వారిని మంత్రి ఆనం సత్కరించారు. ఎన్‌టిఆర్ శతజయంతి సందర్భంగా భారత ప్రభుత్వం ముద్రించిన వంద రూపాయల నాణేలను జిల్లా పార్లమెంటు టీడీపీ కమిటీ సభ్యులకు అందజేస్తూ, ఎన్‌టిఆర్ స్ఫూర్తి, పరిపాలనా దక్షతను ఆదర్శంగా తీసుకొని పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్‌డిసిసి బ్యాంకు ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజరెడ్డి, మాజీ శాసనసభ్యులు కంభం విజయరామిరెడ్డి, స్థానిక నేతలు గిరి నాయుడు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా సిపిఐ శతాబ్ది ఉత్సవాలు

ప్రజాశక్తి-కందుకూరు

గడచిన స్వాతంత్ర్యానికి ముందు స్వాతంత్ర్యం తదుపరి ఈ సమాజంలో ఈ దేశంలో ఉన్న పేద వర్గాలు కార్మిక కర్షక రైతు కూలీ విద్యార్థి యువజన, మహిళ ఉద్యోగ, చిరు ఉద్యోగుల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేస్తూ ఎర్ర జెండా నినాదంతో ముందుకు దూసుకెళ్తున్న పేదల పక్షపాతి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య అన్నారు. సిపిఐ కందుకూరు నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల విజయవంతానికి కందుకూరు సిపిఐకి అండగా ఉన్న సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక సిపిఐ కార్యాలయంలో సిపిఐ జెండాను కందుకూరు ప్రాంతంలో



కమ్యూనిస్టు పార్టీ నాయకులుగా పేరు గడించిన కీర్తిశేషులు కామ్రేడ్ వలేటి రాఘవులు, భార్య కోటేశ్వరమ్మ ఆవిష్కరించి కమ్యూనిస్టు పార్టీకి రాఘవులు కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని నిరూపించారు. అనంతరం సిపిఐ కార్యాలయం నుండి భారీ ర్యాలీ పామూరు రాగదారిలో గల తిరుమల కళ్యాణ మండపం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఒకే ఒక నినాదం చేశారు.కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఆనందమోహన్, నత్త రామారావు, దుర్గాప్రసాద్, ఉప్పుటూరి మాధవరావు, మహిళా సమాఖ్య నాయకులు కల్పనా జ్యోతి, శ్రీరామ్ మూర్తి, నరసయ్య పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-గుడ్లూరు+మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వై.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ శుక్రవారం తెలిపారు. అన్ని శాఖలకు సంబంధించి అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

వంగవీటి రంగా వర్ధంతి



ప్రజాశక్తి-కావలి : బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం కుల మత ప్రాంతాల కతీతంగా జీవితాంతం పోరాటం చేసిన మహనేత వంగవీటి మోహన్ రంగా 37వ వర్ధంతి సందర్భంగా కావలిలోని రైతుబజార్ వద్ద ఏర్పాటు చేసిన రంగా కాంస్య విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. కావలి ట్రంక్ రోడ్డులోని విగ్రహానికి పూలమాలలు వేసి అభిమానులు, నాయకులు, వివిధ వర్గాల ప్రజలు నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడారు. కావలి నడిబొడ్డులో రంగా కాంస్య విగ్రహాన్ని గత ఏడాది ఏర్పాటు చేయడం పట్టణానికే గర్వకారణమని పేర్కొన్నారు. ఈ విగ్రహాన్ని కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేశారని తెలిపారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో అప్పటి మంత్రులు పొంగూరు నారాయణ, నిమ్మల రామానాయుడు పాల్గొనడం విశేషమన్నారు. రంగాను ఏ ఒక్క కులానికి పరిమితం చేయకుండా, అన్నివర్గాల నాయకుడిగా భావించి, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని వక్తలు పిలుపునిచ్చారు. వర్ధంతి కార్యక్రమంలో రంగా విగ్రహ కమిటీ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాసరావు, టిడిపి కావలి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబురావు, దగుమాటి మాల్యాద్రిరెడ్డి, సీనియర్ టిడిపి నాయకురాలు పద్మావతి శ్రీదేవి, ఎఎంసి డైరెక్టర్ కొప్పోలు లక్ష్మి, పసుపులేటి బాబురావు, ఓగిరాల సుధాకర్, పట్టణ వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు పసుపులేటి శ్రీనివాసులు, మామిడాల సాయికుమార్, పాలడుగు వెంకటేశ్వర రావు, పాపిశెట్టి జానకి రామ్, బండికోటి చలపతి రావు, జనసేన కావలి పట్టణ అధ్యక్షుడు పొబ్బా సాయి విఠల్, కుల, మత, ప్రాంత, పార్టీ భేదాలు లేకుండా ప్రజలు పాల్గొన్నారు.

నానో యూరియాతో అధిక ప్రయోజనం



ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : నానో యూరియా వాడకం వల్ల రైతులకు అధిక ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయ శాఖ ఎడి గుమ్మడి అనిత స్పష్టం చేశారు. బుచ్చిరెడ్డిపాలెం మండలంలో సొసైటీల ద్వారా యూరియా పంపిణీ జరుగుతున్న విధానాన్ని శుక్రవారం ఆమె ఆకస్మితంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె వవ్వేరు సొసైటీ బ్యాంక్ ఆవరణంలో రైతులతో మాట్లాడారు. రైతులు మారుతున్న సాంకేతికను ఉపయోగించుకుని వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నానో యూరియా, డిఎపి వాడకం గురించి రైతులకు అవగాహన కల్పించడంలో భాగంగా మండలంలో ఛాంపియన్ ఫార్మర్స్‌ను ఎంపిక చేసామన్నారు. ఆ రైతుకు సంబంధించిన వ్యవసాయ క్షేత్రంలో ప్రయోగాత్మకంగా నానో యూరియాను వాడి రైతులకు అవగాహన కల్పించనున్నట్లు ఆమె తెలిపారు. నానో యూరియా వాడకం వల్ల ఖర్చులు తగ్గడంతో పాటు రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని ఆమె వెల్లడించారు. కోవూరు సబ్ డివిజన్ పరిధిలోని 5 మండలాలలో దాదాపుగా 77వేల ఎకరాలలో రైతులు వరి, వేరుశనగ సాగు చేస్తున్నట్లు తెలిపారు. దానికి సంబంధించి 11వేల మెట్రిక్ టన్నులు ఎరువులు అవసరమన్నారు. బుచ్చిరెడ్డిపాలెం మండలంలో 10వేల ఎకరాలలో వరి సాగు చేస్తుండగా వవ్వేరు సొసైటీకి 1600 మెట్రిక్ టన్నులు అవసరమన్నారు. సొసైటీల ద్వారా 470 టన్నులు, రైతు సేవ కేంద్రాల ద్వారా 500 టన్నులు, డీలర్స్ ద్వారా 300టన్నులు సరఫరా చేసామన్నారు. ఎరువులు పంపిణీ సక్రమంగా జరిగేందుకు పగడ్బంధీగా చర్యలు తీసుకున్నామన్నారు. పెద్ద రైతులకు విడతల వారీగా ఎరువులు అందించగా, చిన్న కారు రైతులకు ఎకరాకు మూడు బస్తాలు చొప్పున ఒకేసారి అందించామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీహరి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాలు ఉపయోగిస్తే చర్యలు



ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : ఆక్వా రైతులు సాగు చేస్తున్న చేపల గుంతలలో చికెన్ వ్యర్థాలను ఉపయోగిస్తే చర్యలు తప్పవని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఏ పొట్టేయ్య పేర్కొన్నారు. మండలంలోని కాగులపాడు గ్రామంలో శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి చేపల గుంటలపై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించగా కాగులపాడు గ్రామంలో ఒక రైతు తన చేపలగుంటలో చికెన్ వ్యర్థాలను ఉపయోగిస్తున్నారన్నారు. వెంటనే ఆ రైతుకు సమాచారం అందజేసి చేపలగుంట వద్దకు పిలిపించి చికెన్ వ్యర్థాలను ఉపయోగించినందుకు జరిమానా విధించడం జరిగిందన్నారు. ఇకమీదట చికెన్ వ్యర్థాలను ఉపయోగిస్తే విద్యుత్ సరఫరాను నిలిపివేయడమే కాకుండా, ప్రభుత్వం ద్వారా అందే పథకాలను నిలిపివేస్తామన్నారు. మండలంలో ఆక్వా రైతులు చికెన్ వ్యర్థాలను వినియోగిస్తే భారీగా జరిమానా విధించడమే కాకుండా, లైసెన్సులు రద్దుచేసి విద్యుత్ అధికారులతో మాట్లాడి సరఫరాను నిలిపివేస్తామన్నారు. కార్యక్రమంలో విఎఫ్ఎ శ్రీనివాస్, ఫీల్డ్ మాన్ వీరాస్వామి పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని ఇర్లపాడుపంట పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఇటీవల మరమ్మతులకు గురై రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చుట్టు పక్కల కాలువలు లేక పోవడంతో పంటలు ఎండిపోయే దశలో ఉండగా స్థానిక ఎఎంసి చైర్మన్ జనార్ధన్ నాయుడు సహకారంతో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని వివరించారు. వెంటనే స్పందించిన మంత్రి విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఆదేశించగా శుక్రవారం అధికారులు ట్రాన్సఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. అన్నదాతలు మంత్రి ఆనంకు కృతజ్ఞతలు తెలియజేశారు.

సమస్యలు పరిష్కరిస్తాం..




ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : బుచ్చిలోని ప్రతి వార్డుల్లోని సమస్యలను తెలుసుకుని ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ పేర్కొన్నారు. బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలో 7వ వార్డులో నిర్వహించిన ప్రశాంతమ్మ ప్రజాపాలన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంను శుక్రవారం నిర్వహించారు. 7వ వార్డులోని ప్రజలు రోడ్లు, డ్రెయినేజీ, పెన్షన్, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని అర్జీలు ఇచ్చారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ ఎంఎల్ఎ ఆదేశాల ప్రకారం ప్రతివార్డుకు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులను సంప్రదించి పరిష్కరిస్తామన్నారు. పట్టణంలోని ప్రజలు ఆయా వార్డులలో జరిగే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వార్డులలోని కౌన్సిలర్లు, నాయకులందరూ కలిసి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ పఠాన్ నస్రీన్, టిడిపి టౌన్ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, కౌన్సిలర్ రహమత్‌బాషా, క్లస్టర్ ఇన్‌ఛార్జి వింజం రామా నాయుడు, సుధాకర్‌రెడ్డి, నాయకులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-వింజమూరు : వింజమూరు మండలం సర్వసభ్య సమావేశం రసాభాసగా మారినది వింజమూరు మండల కార్యాలయంలో మండల వైస్ ప్రెసిడెంట్ ఆనింగ్ రమణయ్య అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో వైసిపి జెడ్‌పిటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి టిడిపి మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. ఈ సందర్భంగా మండలంలో జరిగిన పలు అభివృద్ధి పనులపైన ఎంపిటిసిలు అడిగిన ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం ఇస్తున్న తరుణంలో వింజమూరు టిడిపి మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి కలుగజేసుకొని అధికారుల వద్ద నుండి మైకు తీసుకుని మాట్లాడుతుండగా వైసిపి జెడ్‌పిటిసి గణపం బాలకృష్ణారెడ్డి తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. ఇది అధికారిక సమావేశమని అనధికార వ్యక్తులకు ఇక్కడ చోటు లేదని నర్సారెడ్డి ఇన్ని బయటికి వెళ్ళమని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ తహశీల్దార్, సర్పంచులు, కార్యదర్శులు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఎపి యాదవ ఎంప్లాయిస్ సొసైటీ సభ్యుల ఆధ్వర్యంలో డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య చిన్నపిల్లల వైద్యశాలలో శుక్రవారం డాక్టర్ ఆదిశేషయ్య నూతన సంవత్సరం ఎపి యాదవ ఎంప్లాయిస్ సొసైటీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం అడ్వాన్స్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆత్మీయ అనుచర మిత్రబృందం యలగాల కొండల రావు, కాళ్ళ వెంకటేశ్వర్లు, నల్లమేకల చిన్నయ, డేగా సుబ్బారావు, ఇ.సుందరం, బత్తల రోశయ్య, టి.సురేష్ బాబు, బొబ్బల మల్లికార్జున, భాస్కర్, చిన్నయ్య, మల్లిఖార్జున, రమణయ్య, గంగయ్య, యలగాల కృష్ణయ్య, తదితరులున్నారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపికైన నారాయణ మెడికల్ కళాశాల విద్యార్థి


విద్యార్థినిని అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

ప్రజాశక్తి-నెల్లూరు

హసన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, హసన్, కర్ణాటకలో నిర్వహిస్తున్న జాతీయ సమగ్రత శిబిరం కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రాతినిధ్యం వహించేందుకు డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ప్రోగ్రాం ఆఫీసర్ ఎంపిక ప్రక్రియ పూర్తయిందని నారాయణ వైద్య విద్యా సంస్థల డీన్ డాక్టర్ పి. శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఈ జాతీయ స్థాయి శిబిరానికి డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ తరపున మొత్తం బృందానికి కంటింజెంట్ లీడర్‌గా నారాయణ మెడికల్ కళాశాల ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ డి.ఎమ్. కార్తీక్ ఎంపిక కావడం విశేషమన్నారు. ఆయన నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 10మంది ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు ఈ శిబిరంలో పాల్గొని, రాష్ట్రం విశ్వ విద్యాలయం తరపున ప్రాతినిధ్యం వహించనున్నారని, నారాయణ మెడికల్ కళాశాల ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్ డాక్టర్ దేవీ సాత్విక ఎంపిక కావడం కళాశాలకు మరింత గర్వకారణమన్నారు. జనవరి 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు హసన్‌లో జరుగుతున్న ఈ జాతీయ సమగ్రత శిబిరంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక సామాజిక సేవల గురించి జరుగుతుందని, దేశంలోని సుమారు 15కు పైగా రాష్ట్రాలు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరుగుతుందని, తెలిపారు. అనంతరం నారాయణ మెడికల్ కళాశాల ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ డి.ఎమ్. కార్తీక్ మాట్లాడుతూ ఈ జాతీయ సమగ్రత శిబిరంలో ఉదయం యోగాతో ప్రారంభం అవుతుందన్నారు. మన రాష్ట్రం తరపున డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పాల్గొనడం జరుగుతుందని, రాష్ట్రంలో 10మందిని ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో నారాయణ మెడికల్ కళాశాల ఇంటర్న్స్ ఇన్చార్జి డాక్టర్ కె. హరికృష్ణారెడ్డి, ఎజిఎం ఎ.సి.శేఖర్ రెడ్డి, ఎన్.ఎస్.ఎస్ అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అలీ పాల్గొన్నారు.


పామూరు రోడ్డులో సెంట్రల్ లైటింగ్, డివైడర్ పనులు చకచకా జరుగుతున్న దృశ్యం

శరవేగంగా సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులు

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు పట్టణం ఓ వి రోడ్డు, పామూరు రోడ్డు ప్రాంతాలలో రోడ్డు డివైడర్, సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం నుండి పామూరు రోడ్డు సర్కిల్ తో పాటు ఓ వి రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం నుండి వాసవి నగర్ వరకు ఆక్రమణలను తొలగించి డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులతో పాటు సైడు కాలువలు నిర్మాణం చేపట్టారు. ఇంటూరి నాగేశ్వరరావు కందుకూరు ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టక ప్రధానంగా కందుకూరు పట్టణం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. పట్టణంలోని రహదారుల అభివృద్ధికి జీవో రూ.4 కోట్లతో టెండర్లు పిలిచారు. పామూరు రోడ్డులో డివైడర్, సెంట్రల్ లైటింగ్‌తో పాటు పామూరు రోడ్డు సర్కిల్ లో అత్యంత కాంతులు విరజిమ్మే పెద్ద పోల్ ను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో కందుకూరు పట్టణం నూతన శోభను సంతరించుకోనుంది. కందుకూరు పట్టణంలోని రోడ్ల అభివృద్ధి పనులను ఎట్టి పరిస్థితుల్లో నూతన సంవత్సరం, సంక్రాంతి నాటికి పూర్తిచేసేలా నిర్మాణ పనులను వేగవంతం చేశారు. కందుకూరు పరిసర గ్రామాల నుండి ఉపాధి కోసం హైదరాబాదు, బెంగుళూరు, చెన్నయ్ లాంటి నగరాలకు వెళ్లిన ప్రజలు పెద్ద పండుగకు స్వగ్రామాలకు చేరుకుంటారు. ఈ నేపథ్యంలో వారికి కందుకూరు పట్టణం కొత్తదనంతో స్వాగతం పలకనుంది అనడంలో ఎలాంటి సందేహమూ లేదు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

సిఐటియు మహాసభల జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-కావలి

విశాఖపట్నంలో డిసెంబర్ 31వ తేదీ నుంచి జనవరి 4వ తేదీ వరకు జరగనున్న సిఐటియు ఆల్ ఇండియా 18వ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం కావలి సిపిఎం కార్యాలయంలో నాయకులు వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికవర్గం సమస్యలపై ప్రసంగించేందుకు దేశ నలమూలల నుంచి కార్మిక సంఘాల నాయకులు విచ్చేస్తున్నట్లు తెలియజేశారు. కావున 4న జరిగే మహాప్రదర్శనకు ప్రజలు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వై.కృష్ణమోహన్, ఎస్‌కె.షాన్‌వాజ్, ఎస్.మధు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జె.బాబు, ఓ.రమేష్, పోలయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'ని నీరుగారుస్తున్న కేంద్రం

ప్రజాశక్తి-నెల్లూరు

గ్రామీణ ప్రజల ఉపాధికి అభ్యున్నతికి 2005 వ సంవత్సరంలో అప్పుడు ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రారంభించిన మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ను నీరుగారుస్తూ నేడు ఎన్ డి ఏ ప్రభుత్వం వి బి జి రామ్ జి బిల్లు పార్లమెంట్లో ప్రవేశ పెట్టడం అన్యాయమని జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కే సంజయ్ కుమార్ అన్నారు. సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు గాంధీ బొమ్మ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. సంజయ్ మాట్లాడుతూ పేర్లు మార్చి ప్రజలను ఏ మార్చవద్దని , ఫెడరల్ వ్యవస్థకు ,రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా దక్షిణాది రాష్ట్రాలను చెప్పు చేతల్లో పెట్టుకోవాలని కేంద్రం చేస్తున్న కుటిల ప్రయత్నాలు ఒంటెత్తు పోకడలను నిరసిస్తూ నట్లు తెలిపారు.కార్యక్రమంలో సిటీ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ అడ్వకేట్ సుధీర్, 42వ వార్డు ఇంచార్జ్ ఇర్ఫాన్, మైనార్టీ నాయకులు హనీఫ్, సేవాదళ్ సుజాత, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా క్రీడల్లో 'గీతాంజలి' కీర్తి పతాకం

- వరుసగా నాలుగోసారి ఓవరాల్ ఛాంపియన్


జిల్లా క్రీడల్లో సత్తా చాటిన 'గీతాంజలి' విద్యార్థులు

ప్రజాశక్తి-కోవూరు

గూడూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో డిసెంబర్ 21, 22 తేదీల్లో నిర్వహించిన ఇంటర్ కాలేజియేట్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ (ఐపిఎస్‌జిఎం) జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో గీతాంజలి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు అద్భుత విజయాలు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి ఎన్.సుధాకర్ రెడ్డి శుక్రవారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కళాశాల కోశాధికారి వై.విజయశంకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ పోటీల్లో బాలికలు వ్యక్తిగత ఛాంపియన్షిప్, గేమ్ ఛాంపియన్షిప్, టేబుల్ టెన్నిస్ సింగిల్స్ డబుల్స్, షటిల్ డబుల్స్, కోకో, వాలీబాల్, ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్‌లో ప్రథమ స్థానాలు సాధించారని తెలిపారు. అలాగే బాలురు బాల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ డబుల్స్, షటిల్ డబుల్స్‌లో విజేతలుగా నిలిచి కబడ్డీ, వాలీబాల్‌లో తృతీయ స్థానాలు సాధించారని వివరించారు. వరుసగా నాలుగోసారి ఓవరాల్ ఛాంపియన్షిప్ సాధించడం గర్వకారణమని తెలిపారు. గెలుపొందిన విద్యార్థులు జనవరి 28, 29, 30 తేదీల్లో తిరుపతిలోని ఎస్.వి. పాలిటెక్నిక్‌లో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ అండ్ డైరెక్టర్ డాక్టర్ జి.సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ కె.శ్రావణ్ కుమార్, ప్రిన్సిపాల్ ఎం.మహేంద్రబాబు, అసిస్టెంట్ పీడీ టి.అనిల్‌కుమార్, విభాగాధిపతులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

సైడ్ డ్రెయిన్‌ల ఆక్రమణ

- అల్లూరు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం : సిపిఎం


ట్రాఫిక్‌కు ఇబ్బందికరంగా చెత్తాచెదారం

ప్రజాశక్తి-అల్లూరు : అల్లూరు నగర పంచాయతీ పరిధిలో ఇరువైపులా సైడ్ డ్రెయిన్‌లపై జరుగుతున్న ఆక్రమణల కారణంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని సిపిఎం మండల కార్యదర్శి గోపసాని రమేష్ తీవ్రంగా విమర్శించారు. డ్రైన్‌లపై అక్రమంగా షాపులు, తాత్కాలిక కట్టడాలు నిర్మించడంతో రోడ్డు వెడల్పు గణనీయంగా తగ్గిపోయి వాహనాల రాకపోకలు స్తంభించిపోతున్నాయని తెలిపారు. ముఖ్యంగా పాత బస్టాండ్ ప్రాంతంలో ఆక్రమణల వల్ల రెండు వైపులా రోడ్డు పూర్తిగా వినియోగించుకోలేని పరిస్థితి నెలకొందని, దాంతో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రంగా మారిందన్నారు. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించుకున్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రద్దీ సమయాల్లో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అత్యవసర సేవల వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. డ్రెయిన్‌లపై ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించి రోడ్లను విస్తరించడంతో పాటు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యం కొనసాగితే ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని గోపసాని రమేష్ హెచ్చరించారు. గతంలో విఐపి హ్యూమన్ రైట్స్ స్టేట్ ప్రెసిడెంట్ ఎల్లు సాల్మన్ కూడా ఫిర్యాదు చేశారు.

థర్మల్ భూముల్లో ఆక్వా సాగుకు ప్రయత్నం

ప్రజాశక్తి-ముత్తుకూరు

కృష్ణపట్నం రైతాంగం థర్మల్ కేంద్రం నిర్మాణానికి భూములు స్వాధీనం చేస్తే ఆ భూముల్లో కొంతమంది స్వార్థపరులు ఆక్వా సాగు చేసేందుకు ప్రయత్నం చేశారు. థర్మల్ కేంద్రం ప్రహరీ గోడ – బకింగ్ హామ్ కెనాల్ భూ భాగం మధ్యలో ఉన్న ఈ భూముల్లో కొద్దిరోజుల క్రితం జంగిల్ క్లియరెన్స్ పనులు యంత్రాలతో చేయించారు. సుమారు 30 ఎకరాల్లో పనులు జరిగినాయి. రైతులు భూముల్లో ఆక్వా కల్చర్ చేసేందుకు సిద్ధపడటం ఏమిటో అర్థం కావడం లేదు. యంత్రాలతో చెట్లు తొలగించి సిద్ధం చేసుకున్నారు. రొయ్యల పెంపకానికి ఇక్కడ వనరులు అనుకూలంగా ఉండడం వల్ల ఈ భూమిని ఎంచుకున్నారు. థర్మల్ భూముల్లో ఆక్వా సాగు చేసేందుకు పనులు జరుగుతున్నాయని తెలుసుకున్న గ్రామస్తులు ప్రశ్నించి నిలదీశారు. దాంతో భూములు ఆక్రమించుకున్న ప్రైవేట్ వ్యక్తులు పనులు చేయడం మానేశారు. ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.

రాపూరును జిల్లాలో ఉంచాలి

- కాంగ్రెస్ డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు

రాపూరు మండలంను తిరుపతి జిల్లాలో కాకుండా నెల్లూరు జిల్లాలో ఉంచాలని కలెక్టర్ కు, పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీ లో భాగంగా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ కే సంజయ్ కుమార్ విన్నవించారు. సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నారపురెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు గత 15 రోజులుగా రాపూరు మండలాన్ని జిల్లాలో కలపాలని చేస్తున్న ప్రజా ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని, దానిలో భాగంగా పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీకి కాంగ్రెస్ పార్టీ తరపున సిటీ జనరల్ సెక్రెటరీ అడ్వకేట్ సుధీర్, సిటీ ఉపాధ్యక్షుడు ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

'కరెంటోళ్ల జనబాట'

ప్రజాశక్తి-సంగం

మండలంలోని సిద్ధిపురం గ్రామంలో శుక్రవారం విద్యుత్ శాఖ ఎఇ మన్మథరావు, స్థానిక టిడిపి నాయకులు సూరా శ్రీనివాసులు రెడ్డితో కలిసి కరెంటోల్ల జనబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల ఇంటింటికీ తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏ సమస్య ఉన్న వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్తు అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, లైన్‌మెన్‌లు, జూనియర్ లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

హాస్పిటల్ నిర్మాణానికి స్థలం పరిశీలన

ప్రజాశక్తి-ముత్తుకూరు

ఎపి జెన్‌కో రోడ్డు మార్గంలో హాస్పిటల్ నిర్మాణానికి భూముల పరిశీలన కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు నిర్వహించారు. సర్వే నెంబర్ 685/3లో సుమారు ఎకరా భూమిని రికార్డు పరంగా జాయింట్ కలెక్టర్ చూశారు. ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సిఎస్ఆర్ నిధులతో ఎకరా స్థలంలో నిర్మాణం చేస్తుందని జెసి తెలిపారు. ఆయనవెంట తహశీల్దార్ స్వప్న, విఆర్ఒ నారాయణ, తదితరులున్నారు.

పలుచోట్ల సిపిఐ జెండా ఆవిష్కరణలు


కావలిలో..

ప్రజాశక్తి-కావలి : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శత సంవత్సర వేడుకల సందర్భంగా శుక్రవారం కావలి నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో సిపిఐ ఆఫీస్‌లో సిపిఐ జెండాను శుక్రవారం సిపిఐ సీనియర్ నాయకులు బిళ్ళ పురుషోత్తం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు దామా అంకయ్య మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26 భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆవిర్భవించి నేటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా శతాబ్ది వేడుకలు ఘనంగా జరుగుతున్నాయన్నారు. పేద బడుగు బలహీన అట్టడుగు వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం" సిపిఐ" ఎర్రజెండా నాయకత్వంలో పోరాటాలు ప్రారంభించి, 100 సంవత్సరాల శత సంవత్సర ఉత్సవాలు ముగింపు సభను జనవరి 18వ తేది తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలో దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నారని తెలిపారు. ఈ సభకు దేశవ్యాప్తంగా 10 లక్షల మంది కార్యకర్తలు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కొప్పర్తి నాగరాజు, సహాయ కార్యదర్శి బోస్, సిపిఐ నాయకులు పి.నరసింహ, ఎఐటియుసి నాయకులు వై.రవి, తన్నీరు పద్మ, వల్లెపు లక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.


సౌత్‌మోపూరులో..

ప్రజాశక్తి-నెల్లూరు : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతజయంతి ఉత్సవాల సందర్భంగా నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్‌మోపూరు గ్రామంలో పముజుల దశరథ రామయ్య, సిపిఐ సీనియర్ నాయకులు, జెండా ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా అరిగెల సాయి, సిపిఐ జిల్లా కార్యదర్శి పాల్గొన్నారు. కార్యక్రమంలో నెల్లూరు రూరల్ మండల కార్యదర్శి చినఅంకయ్య, సిపిఐ కార్యవర్గ సభ్యుడు మాలకొండయ్య, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు జిలాని, సిపిఐ నెల్లూరు రూరల్ మండల సహాయ కార్యదర్శి, వై ఆదినారాయణ, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పముజుల హరి, సల్ల నరసయ్య, శ్రీరాములు, రాజగోపాల్, రాంబాబు, పముజుల వెంకటరమణయ్య, తుళ్లూరు శేషయ్య, దండు శేషయ్య, తదితర కార్యకర్తల పాల్గొన్నారు.


ఆత్మకూరులో..

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ శత దినోత్సవ వేడుకలు సందర్భంగా ఆత్మకూరు నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఆత్మకూరు పట్టణం బస్టాండ్ సెంటర్ ప్రాంగణంలో సిపిఐ జెండాను సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యామాల మధు ఎగరవేశారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యమాల మధు మాట్లాడుతూ పేద బడుగు బలహీన అట్టడుగు వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం" సిపిఐ" ఎర్రజెండా నాయకత్వంలో పోరాటాలు ప్రారంభించి 100 సంవత్సరాల శతజయంతి ఉత్సవాలు ముగింపు సభను జనవరి 18 వ తేది తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలో దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి జంగం నాగరాజు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఇండ్ల అంకమ్మ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి బెల్లంకొండ హజరత్తయ్య, మున్సిపల్ నాయకులు నాగేంద్ర చెంచయ్య, వాసు, నాయకులు మాలకొండయ్య, హరి, బాబు, ఉతన్నారు.


మాట్లాడుతున్న ఉపఖజానా అధికారి ఉస్మాన్

రిటైర్డ్ ఉద్యోగులు, టీచర్ల సమస్యలపై సమావేశం

ప్రజాశక్తి-ఉదయగిరి

పూర్వ ఉద్యోగుల ఉపాధ్యాయుల సమస్యలపై స్థానిక ఖజానా కార్యాలయంలో పెన్షనర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉప ఖజానాధికారి షేక్ ఉస్మాన్ మాట్లాడుతూ పెన్షనర్లు ఎదుర్కొంటున్న అనేక ఇబ్బందులను తొలగించామని ఇంకేమైనా తమ దృష్టికి తెస్తే సత్వరంగా పరిష్కరిస్తామన్నారు. సర్వీసు పెన్షన్‌దారులు, కుటుంబ పెన్షనుదారులు జనవరి, ఫిబ్రవరిలోగా లైఫ్ సర్టిఫికెట్లను తప్పనిసరిగా సమర్పించాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా కూడా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించవచ్చున్నారు. మంచానికి పరిమితమై ఉన్న పింఛనుదారులు తమకు సమాచారం అందిస్తే స్వయంగా పరిష్కరిస్తామని ఖజానాధికారి ఉస్మాన్ తెలిపారు. పెన్షనుదారుల ఆదాయపు పన్ను మదింపు, ఈహెచ్ఎస్, క్వాంటం పెన్షను గురించిన వివరాలపై సందేహాలకు సమాధానాలిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, తాలుకా పూర్వ ఉద్యోగుల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఖాదర్ బాషా, అబ్దుల్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

In the Court of the Principal District Judge : Nellore
I.A.No. 553 / 2025
O.S.No. 27 / 1998

Gadam Muni Sivanandham - Petitioner / 2nd Defendant

Vs

1. Gadam Muni Gayathri alias **Muni Sri Vyshnavi** and 5 others - Respondents

Notice

To,
R1. Gadam Muni Gayathri alias **Muni Sri Vyshnavi,** D/o **Muni Sri Vishnu,** residing at 23/611, Sagilavari st, Fathekhanpet, Nellore City (2nd Plaintiff)
R4. Gadam Muni Sri Vishnu, S/o late **Muni Rathnam,** Doctor, Sadasivapet, Sangareddy Mandal, Hyderabad, Telangana State (3rd Defendant)

పై నెంబరున పిటిషనరు / 2వ ప్రతివాది తేది: 15-02-2007దిన ఇచ్చిన Preliminary Decree షరతుల ప్రకారం ఎ-షెడ్యూలు ఆస్థిలో 1/5 వ భాగమును అలాట్ చేయమని కోరుతూ పై తెలిపిన కోర్టులో ఫైనల్ డిక్రీ పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే09-01-2026దికి** వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకో వలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

బి.శ్రీనివాసన్, బి.ఎస్‌సి., బి.ఎల్.,
పిటిషనర్ / 2వ ప్రతివాది తరపు అడ్వకేట్, నెల్లూరు.

In the Court of the Principal District Judge : Nellore
E.P.No. 192 / 2025
ARB. CASE No. ARC/FSBFL/1387/2022

M/s. **FIVE STAR BUSINESS FINANCE LIMITED,** Represented at present by Authorized Signatory **Yerramsetti Shyam Prasad,** Regional Legal Manager - D.Hr./Claimant

Vs

1. Gurram Bhuvaneshwari
W/o **Koteswara Rao**
2. Gurram Koteswara Rao
S/o **Gurram Satyam** - J.Drs / Respondents

వేలం ప్రకటన

పై నెంబరున డిక్రీ హోల్డర్ డిక్రీ బాకీ రాబట్టు కొనుటకు జె.డి.ఆర్స్ తాలూకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని **తే09-01-2026దిన ఉదయం 10.30 గంటల** నుండి **సాయంత్రం 5 గంటల** లోపల పై తెలిపిన కోర్టులో బహిరంగ వేలం పాట జరుపబడును. కావున పాటదారులు ఎవ్వరైనా వేలంపాటలో పాల్గొని పాటపాడుకొనవచ్చును.

SCHEDULE OF PROPERTY

S.P.S.R. Nellore District - Nellore Registration District, - Muthukur Sub Registration - Muthukur Mandal - Thallapudi Grama Panchayat - Thallapudi Village Survey No. 219/C, an extent of 320 sq.yds of Land bounded by: East : Site of Kakuturu Kodanda Rami Reddy, South: Raja Street, West: Raja Street, North: Site of Jangita Chandraiah.

DHR Value of Rs.8,00,000/-
Field Assistant Value of Rs.12,00,000/-
Market Value of Rs.11,18,940/-

సిహెచ్.సుభాషిణి, బి.ఎస్‌సి., బి.ఎల్.,
డిక్రీ హోల్డర్ తరపు అడ్వకేట్, నెల్లూరు.

In the Court of the Principal Senior Civil Judge : Nellore
S.O.P.No. 129 / 2025

1. Mohammed Abdul Mobeena
W/o **Mohammed Abdul Jameel Baig**
2. Mohammed Abdul Jameer Baig,
S/o **Mohammed Abdul Jameel Baig,**
3. Mohammed Abdul Hafeez Baig,
S/o **Mohammed Abdul Jameel Baig,**
4. Mohammed Abdul Saif Baig,
S/o **Mohammed Abdul Jameel Baig,**
5. Mohammed Abdul Mumtaz Begum,
S/o **Mohammed Abdul Jameel Baig,**
all are resident of D.No. 28-9-1307, Rehaman Street, Venkateswarapuram, Near Don Bosco School, Nellore-524005, SPSR Nellore District. - Petitioners

Vs

Nil - Respondents

జనరల్ నోటీసు

పై నెంబరున 1వ పిటిషనరుకు భర్త 2, 3, 4 పిటిషనర్లుకు తండ్రి గారు 5వ పిటిషనరుకు కుమారుడు అయిన **Mohammed Abdul Jameel Baig** గారు తేది: 13-11-2021 న చనిపోయినందున ఆయనకు రావాల్సిన ఈ క్రింది షెడ్యూలులో చూపిన మొత్తములను తీసుకొనుటకు గాను పై పిటిషనర్లును వారసులుగా గుర్తించి వారసత్వపు సర్టిఫికేట్ మంజూరు చేయమని కోరుతూ పై తెలిపిన కోర్టులో S.O.P.No. 129 / 2025 అను పిటిషన్ను దాఖలు చేసియున్నందున, సదరు పిటిషన్‌పై ఎవ్వరికైనను ఆక్షేపణలు ఉన్నయెడల **తే06-01-2026న** ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినదిగా ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

SCHEDULE

S.No.	Subject Debt	Amount in Rs.
1.	Employee Provident Fund No. GRCDP/69449/10120	80,000-00
2.	Pension	1,00,000-00
3.	Death benefits	3,00,000-00
	Total	4,80,000-00

దామా ధమరేశ్వర్, బి.ఎ., బి.ఎల్.,
పిటిషనర్లు తరపు అడ్వకేట్, నెల్లూరు.